



కమనీయం.. అప్పన్న నిజరూపం

- దర్శించి తరించిన భక్తజనం
- సింహాచలంలో వైభవంగా చందనోత్సవం

6లో

అప్పన్న నిజరూప దర్శనానికి తరలివచ్చిన భక్తులు

వారి ప్రాణాలు..

గాలిలో దీపాలు

అరసవల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు వారివి. బతుకు పోరాటంలో అనునిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవన ప్రయాణాన్ని సాగి స్తూనే ఉంటారు. శ్రీకాకుళంలో బుధవారం ఓ హోర్డింగ్ ఏర్పాటు పనుల్లో కార్మికులు ఇలా నిమగ్నమయ్యారు. కార్మిక దినోత్సవం సందర్భంగా.. కార్మికుల శ్రమజీవనానికి ఈ చిత్రం అద్దం పట్టింది.



నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం



నరసన్నపేటలో చెత్తను ఎత్తుతున్న పారిశుధ్య కార్మికులు

అన్నింటికీ వీరే!

6లో

- రోడ్డు ఊడ్చాలన్నా.. కాలువ తీయాలన్నా..
- అనాథ మృతదేహాలను పూడ్చిపెట్టాలన్నా..
- నేతలు, అధికారులు వస్తే తీరికే ఉండదు
- చీపురు పడితేనే భత్యం.. లేదంటే పస్తులే
- కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల దుస్థితిదీ



నరసన్నపేట ఏరియా ఆసుపత్రి

నకిలీల సదరం

- నరసన్నపేటలో తప్పుడు దివ్యాంగపత్రాల జారీ
- పోలీసులకు డీసీహెచ్ ఫిర్యాదు
- నలుగురు వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌పై కేసు
- శాఖాపరంగా నివేదిక కోరిన వైద్యవిధాన పరిషత్



సదరంలో తప్పుడు దివ్యాంగుల పత్రాలు జారీపై దర్యాప్తు చేపట్టిన టెక్కలి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సూర్యారావు (ఫైల్)

నరసన్నపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో సకలాంగులకు దివ్యాంగులుగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చిన వ్యవహారంలో నలుగురు వైద్యులతోపాటు డేటాఎంట్రీ ఆపరేటర్‌పై కేసు నమోదు చేశామని నరసన్నపేట ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. 2022లో నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన సదరంలో పొందూరు మండలం తోలాపి గ్రామానికి చెందిన 24 మందికి దివ్యాంగుల సర్టిఫికెట్‌లు ఇచ్చారు. వీటిలో 22 మంది అనర్హులకు వైద్యులు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారని తోలాపి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పొన్నాడ అప్పారావు 2023 ఏప్రిల్ 17న 'స్పందన' కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు టెక్కలి ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యారావు దర్యాప్తు చేపట్టారు. 22 మందికి దివ్యాంగులుగా ఆర్థోపెడిక్ విభాగంలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినట్లు నిర్ధారించారు. దీనిపై అప్పటి డీసీహెచ్ రాజలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా నరసన్నపేట ఆసుపత్రిలోని సదరంలో కోటబొమ్మాళి, పొందూరు, జలుమూరు తదితర మండలాలకు చెందిన వారికి దివ్యాంగులుగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. వీరంతా సామాజిక పింఛన్లు పొందారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత ఈ వ్యవహారంపై లోతుగా విచారణకు ఆదేశించింది. దీంతో ఒకపక్క విచారణ జరుగుతుండగా, ప్రస్తుత జిల్లా ఆసుపత్రులు సమన్వయకర్త (డీసీహెచ్) డాక్టర్ కళ్యాణబాబు ఈ వ్యవహారంపై పోలీసులకు మళ్లీ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. అప్పట్లో తప్పుడు ధ్రువీకరణ పత్రాలను జారీ చేసిన ఆర్థోపెడిక్ వైద్యులు చల్లా మోహన్‌రవికిరణ్, ఈ పత్రాలపై రెండో డాక్టర్‌గా సంతకాలు చేసిన బాలక నవీన్, డా.నాగమల్లీశ్వరి, అప్పటి సూపరింటెండెంట్ పి.జయశ్రీ, డేటాఎంట్రీ ఆపరేటర్ సి.శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. చార్జిషీటును కోర్టులో దాఖలు చేశామన్నారు.

వైద్యవిధాన పరిషత్ నోటీసులు

సదరంలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ (మిగతా 6వ పేజీలో..)

పేదలకు ప్రైవేటు విద్య

- ప్రైవేటు స్కూళ్లలో 25శాతం సీట్లు ఉచితం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదుకు అవకాశం



రణస్థలం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి):

పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచితంగా అడ్మిషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎంఈవోలు ఇప్పటికే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు ఈ విషయం తెలియజేశారు. విద్యాహక్కు చట్టం అమల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాలు పాటించాలని.. లేదంటే చర్యలకు ఉపక్రమిస్తామని హెచ్చరించారు. అడ్మిషన్లకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదును ఆహ్వానించారు. మే నెల 15 వరకూ దరఖాస్తుల నమోదు ప్రక్రియ కొనసాగనుంది. ఫస్ట్ రౌండ్‌లో లాటరీ ద్వారా ఎంపికైనవారి వివరాలు మే 21 నుంచి 24లోపు ప్రకటిస్తారు. జూన్ 2వ తేదీలోగా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేస్తారు. అలాగే రెండో రౌండ్‌లో ఎంపికైన జాబితాను జూన్ 6న ప్రకటించి.. జూన్ 12న అడ్మిషన్లు పూర్తి చేస్తారు. గత అనుభవాల దృష్ట్యా 25శాతం అడ్మిషన్ల ప్రక్రియ పక్కాగా అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పారదర్శకత కోసం ఆరు అంచెల్లో నిర్ధారించిన తరువాత విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులు, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, బీసీ మైనార్టీ, అగ్రకులాల్లో పేదలను ప్రధాన పరిగణనగా తీసుకుంటారు. అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5 శాతం, షెడ్యూల్ కులాలకు 10 శాతం, ఎస్టీ పిల్లలకు 4 శాతం కేటాయిస్తారు. బీసీ, మైనార్టీ, ఓసీ గ్రామీణ ప్రాంతాల కుటుంబాలకు వార్షికాదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంత కుటుంబాలకు రూ.1.44 లక్షలు మించకుండా ఉంటే 6 శాతం సీట్లు కేటాయిస్తారు. విద్యార్థులకు మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో చేరేందుకు అవకాశం కల్పిస్తారు.

ఇదీ పరిస్థితి

జిల్లాలో 292 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రతి పాఠశాలల్లో అడ్మిషన్లలో 25 శాతం సీట్లు పేదలకు ఉచితంగా ఇవ్వాలి. గడిచిన మూడేళ్లలో 1,612 మందికి సీట్లు ఇచ్చినట్టు విద్యాశాఖ గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది ఆన్‌లైన్‌లో 3,089 మంది దరఖాస్తు చేసుకున్నారు. లాటరీ ద్వారా 1,554 మందిని ఎంపిక చేశారు. అందులో 1,127 మంది మాత్రమే అడ్మిషన్లు పొందినట్టు అధికారులు చెబుతున్నారు. గతంలో అడ్మిషన్ల విషయమై కొన్ని ప్రైవేటు యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. కానీ విద్యాహక్కు చట్టం అమలు చేయాల్సిందేనని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. దీంతో 25 శాతం ఉచిత అడ్మిషన్ల విధానాన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పక్కాగా అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాగా.. పేరుకే ఉచిత అడ్మిషన్లు అని.. తీరా పాఠశాలల్లో చేరాక ఫీజులు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. పుస్తకాలతోపాటు యూనిఫాం కొనుగోలు చేయాలని.. అడ్మిషన్, పరీక్ష ఫీజులంటూ గుంజేశారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రైవేటు పాఠశాలల నుంచి ఫీజుల ఒత్తిడి లేకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కచ్చితంగా పాటించాలి

ప్రైవేటు పాఠశాలల్లో విధిగా 25శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలి. దీనిపై కోర్టు కూడా స్పష్టమైన తీర్పు ఇచ్చింది. ఉచితంగా అడ్మిషన్లు ఇచ్చి తర్వాత ఫీజులు వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధం. అలా చేసిన యాజమాన్యాలపై చర్యలు తప్పవు. కచ్చితంగా అన్ని పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలను పాటించాల్సిందే. -తిరుమల చైతన్య, డీఈవో, శ్రీకాకుళం

రూ.10కోట్లతో టూరిజం పార్కు అభివృద్ధి

- మదనగోపాల సాగరాన్ని సర్వే చేసిన అధికారులు

8లో



కొత్తూరు సీహెచ్‌సీలో సొంత ఫ్యాన్‌లు వినియోగించుకుంటున్న బాలింతలు, గర్భిణులు

ప్రసవానికి వస్తున్నారా.. ఫ్యాన్ తీసుకురండి

- కొత్తూరు సీహెచ్‌సీలో ఉక్కపోత
- గర్భిణులకు తప్పని అవస్థలు

కొత్తూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు వైద్యసేవలు, కనీస సౌకర్యాలు కరువవుతున్నాయి. కొత్తూరు సామాజిక ఆస్పత్రిలోని పలువార్డుల్లో సీలింగ్ ఫ్యాన్‌లు సక్రమంగా తిరగడం లేదు. దీంతో వేసవి వేళ ప్రధానంగా గర్భిణులు, బాలింతలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సామాజిక ఆస్పత్రిలో ప్రసవం కోసం వచ్చేవారు.. ఇళ్ల నుంచే ఫ్యాన్‌లు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఫ్యాన్‌లు తెచ్చుకోనివారు గాలి కోసం నరకయాతన పడుతున్నారు. బాలింతలు ఉండే గది పడమర భాగాన ఎటువంటి భవనాలు లేవు. దీంతో ఎండతీవ్రతతో గోడలు వేడి ఎక్కిపోతున్నాయి. ఫలితంగా రూములో ఉష్ణోగ్రత పెరిగిపోవడం.. సీలింగ్ ఫ్యాన్‌లు లేకపోవడంతో బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రికి మంజూరయ్యే అభివృద్ధి నిధులతో కనీసం కొత్త ఫ్యాన్‌లు అయినా ఏర్పాటు చేయాలని బాలింతలు, గర్భిణులు కోరుతున్నారు. ఈ విషయమై సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ ధర్మాన కిషోర్ వద్ద ప్రస్తావించగా.. 'బాలింతల గదిలో సీలింగ్ ఫ్యాన్‌లు ఉన్నాయి. వీటి గాలి చాలకపోవటం వల్ల ఎండ తీవ్రతకు ఇళ్ల నుంచి ఫ్యాన్‌లు తెస్తున్నారు. కొత్త ఫ్యాన్‌లు ఏర్పాటు చేస్తామ'ని తెలిపారు.



వానొచ్చె.. వరదొచ్చె

శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిన వర్షపునీరు

అరసవల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గాలివాన బీభత్సం సృష్టించింది. కుండపోత వర్షం కురవడంతో శ్రీకాకుళంలో రహదారులు జలమయమయ్యాయి. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్సు ఆవరణలో నీరు చేరి.. చెరువును తలపించింది. పీఎస్ఎన్ఎం పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోయింది. శ్రీకాకుళం నగరం, గుజరాతీపేట నుంచి తోటపాలెం వెళ్లే రోడ్డు బురదమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కొన్నిచోట్ల రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. అలాగే ఈదురుగాలుల ప్రభావానికి ప్రకటనల హోర్డింగులు నేలకొరిగాయి. మామిడికాయలు నేలరాలి రైతుల ఆశలను నీరుగార్చాయి.

కూలిన వందేళ్లనాటి వృక్షం

హరిపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మందస మండలం కొత్తపల్లి పంచాయతీ ముకుందపురం వద్ద మందస- కొత్తపల్లి రోడ్డులో సుమారు వందేళ్లనాటి వృక్షం కూలిపోయింది. మంగళవారం అర్ధరాత్రి వీచిన గాలులకు ఈ చెట్టు కూలిపోగా.. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆర్అండ్‌బీ అధికారులు స్థానికులతో కలిసి కూలిన వృక్షాన్ని తొలగించారు.



బంగారు కుటుంబాలకు

బాసటగా నిలవండి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన పీ-4 విధానాన్ని జిల్లాలో ప్రభావవంతంగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వే ద్వారా జిల్లాలో ఆర్థికంగా అట్టడుగున ఉన్న 75,566 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామన్నారు. ఈ కుటుంబాలకు బాసటగా ఉండి వారిని సమాజంలో ఉన్నత స్థితికి చేర్చేందుకు 10శాతం మంది మార్గదర్శులుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒక్కో బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకుని, వారికి విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ఇతర అవసరాల కోసం తోడ్పాటును అందించాలన్నారు. ప్రభుత్వ-ప్రైవేటు-ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలనుకునే వారు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో మాత్రమే కాకుండా రాష్ట్రం, దేశం నలుమూలల ఉన్న శ్రీకాకుళం జిల్లావాసులు ముందుకు రావాలని కోరారు.

ప్రశాంతంగా పాలిసెట్

- 89.84 శాతం హాజరు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో మొత్తం 39 కేంద్రాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 11,373 మంది విద్యార్థులకుగానూ 10,217 మంది పరీక్ష రాశారు. 89.84 శాతం హాజరు నమోదైంది. శ్రీకాకుళం సమన్వయ కేంద్రం పరిధిలోని 25 కేంద్రాల్లో బాలురు 3,835 మంది, బాలికలు 3,138 మంది మొత్తం 6,973 మందికిగానూ 6,183 మంది హాజరయ్యారు. టెక్కలి సమన్వయ కేంద్రం పరిధిలోని 14 కేంద్రాల్లో బాలురు 2,598 మంది, 1,802 మంది బాలికలు మొత్తం 4,400 మందికిగానూ 4,034 మంది పరీక్ష రాశారు. పరీక్షల నిర్వహణకు సమన్వయకర్తలుగా డాక్టర్ బి.జానకిరామయ్య, ఎ.గోపి, జిల్లా పరిశీలకులుగా డాక్టర్ ఎల్.విజయలక్ష్మి వ్యవహరించారు.

కమనీయం.. అప్పన్న నిజరూపం



- దర్శించి తరించిన భక్తజనం
- వైభవంగా చందనోత్సవం
- సింహగిరికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి):

ఏడాదికోసారి నిర్వహించే సింహాచలం వరాహలక్ష్మీనృసింహ స్వామి నిజరూప దర్శనం (చందనోత్సవం) బుధవారం వైభవంగా జరిగింది. లక్షకుపైగా తరలివచ్చిన భక్తుల జయజయధ్వానాల మధ్య అప్పన్నకు పైపూతగా సమర్పించిన చందన విసర్జన కార్యక్రమాన్ని మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత అర్చకులు ప్రారంభించారు. మూలవిరాట్‌పై ఉన్న 12 మణుగుల (500 కిలోలు) సిరి చందనాన్ని నోటికి గుడ్డలు కట్టుకుని రజిత బొరిగెలతో ఒలిచి, స్వామిని నిజరూపంలోకి తీసుకువచ్చారు. అనంతరం స్వామి శిరస్సు, గుండెలపై రెండు చందనపు ముద్దలను ఉంచారు. షోడశోపచార పూజలు చేసిన తరువాత ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యులకు తొలిదర్శనం కల్పించారు. తెల్లవారుజామున 2.45 గంటల నుంచి సాధారణ భక్తులను దర్శనానికి అనుమతించారు.

తరలివచ్చిన భక్తులు..

స్వామిని నిజరూపంలో దర్శించుకునేందుకు ఉత్తరాంధ్ర నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఒడిశా నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో అర్ధరాత్రి నుంచే క్యూలైన్లు కిక్కిరిసి పోయాయి. ప్రముఖులకు ఉదయం ఆరు గంటల వరకు మాత్రమే అంతరాలయ దర్శనాలు కల్పించిన అధికారులు అనంతరం నీలాద్రి గుమ్మం వద్ద గేటుకు తాళాలు వేశారు. ఇదిలావుండగా తెల్లవారుజామున జోడుభద్రాల వద్ద రూ.300 క్యూ సమీపంలో గోడ కూలి ఏడుగురు మృతి చెందడంతో సర్వత్రా ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో భక్తుల రాక తగ్గింది. ఆ తరువాత క్రమేపీ రద్దీ పెరుగుతూ ఉదయం పదిన్నర గంటల సమయానికి నిర్దేశించిన క్యూలను దాటి సుమారు 1.5 కిలోమీటర్ల పొడవున ఘాట్‌రోడ్డుపైకి చేరింది. తెల్లవారుజామున భారీవర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో మరింతమంది భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆ తరువాత వర్షం కురిసినప్పటికీ భక్తుల తాకిడి తగ్గలేదు. పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు నిజరూప దర్శనం చేసుకున్నారు.





స్వామికి పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న అశోక్ గజపతిరాజు దంపతులు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



బస్సుల వద్ద భక్తజనం

సంప్రదాయబద్ధంగా సహస్ర ఘటాభిషేకం..

ఆలయ ఆచారం ప్రకారం రాత్రి 9.30 గంటల సమయంలో ఆధ్యాత్మికవేత్త త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయరుస్వామి పర్యవేక్షణలో నాలుగు వందల మంది శ్రీవైష్ణవులు అంతరాలయంలో స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఆ తరువాత తొలివిడత చందన సమర్పణ గావించి, శీతలోపచారాలు సమర్పించి కర్పూర నీరాజనాలిచ్చారు. అప్పన్నను నిత్యరూపంలోకి తీసుకురావడంతో చందనోత్సవం పరిసమాప్తమయింది.







స్వామి దర్శనానికి వచ్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబసభ్యులు



నరసన్నపేటలో చెత్తను ఎత్తుతున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులు

- రోడ్డు ఊడ్చాలన్నా.. కాలువ తీయాలన్నా..
- అనాథ మృతదేహాలను పూడ్చిపెట్టాలన్నా..
- నేతలు, అధికారులు వస్తే తీరికే ఉండదు
- నిత్య శ్రామికులు, సేవకులు వీరు
- చీపురు పడితేనే భత్యం.. లేదంటే పస్తులే
- కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల దుస్థితిదీ

నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం



అన్నింటికీ వీరే!

అరసవల్లి, నరసన్నపేట/ఇచ్ఛాపురం/ పలాస, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి):

వారు నిత్య శ్రామికులు. రోడ్లపై ఎక్కడ చెత్త కనిపించినా.. కాలువల్లో మురుగు పేరుకుపోయినా పరిశుభ్రం చేస్తారు. ఆ ప్రాంతాన్ని ఆహ్లాదకరంగా మారుస్తారు. శుభ్రతకు చిరునామాగా నిలిచిన పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి. ఆరోగ్యకరమైన సమాజంలో వారి పాత్ర ఎంతో కీలకం. చెత్త ఊడవడం, కాలువల్లో పూడిక తొలగించడం, వాటిని ట్రాక్టర్లలో డంపింగ్ యార్డుకు తరలించడం, అనాథలు చనిపోయిన సందర్భాల్లో వారి మృతదేహాలకు దహన సంస్కరణలు చేపట్టడం చేస్తుంటారు. వీఐపీలు సందర్శించే సమయాల్లో బండెడు చాకిరీ చేస్తుంటారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 9 గంటలు వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6 వరకు విధులు నిర్వహిస్తుంటారు. కానీ, వారి జీతాలు మాత్రం అరకొరగా ఉన్నాయి. చీపురు పడితేనే వారికి ఆ రోజు భత్యం. లేదంటే పస్తులు ఉండవల్సిన పరిస్థితి. గురువారం మే డే సందర్భంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఇచ్ఛాపురం, పలాస మున్సిపాల్టీలు, నరసన్నపేట మేజర్ పంచాయతీలో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల కష్టాలు వారి మాటల్లోనే..

ఈ పని.. దేవుడిచ్చిన వరం



నేను మూడు దశాబ్దాలుగా పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాను. గొప్ప సేవ చేసేందుకు.. ఈ పని నాకు దేవుడిచ్చిన గొప్ప వరం, అవకాశం. ఈ పనిలో ఎంతో సంతృప్తి, ఆనందం ఉంది. ఎంతోమంది అనాథలకు ఆత్మీయుడిగా అంత్యక్రియలు చేశాను. బంధువులు, కుటుంబ సభ్యులు కూడా దరిచేరలేని.. కరోనావ్యాప్తి సమయంలో ఎన్నో మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహించాను. ఓ నాలుగు రోజుల పసికందు మృతదేహాన్ని ఆ సమయంలో తల్లిదండ్రులు వదిలేస్తే... ఆ శిశువుకు నాగావళి నది ఒడ్డున అంత్యక్రియలు నిర్వహించడం ఎప్పటికీ మరిచిపోలేను. నాకు ఓపిక ఉన్నంతవరకు ఇదే పని చేస్తా.

-గురుమూర్తి, పారిశుధ్య కార్మికుడు, శ్రీకాకుళం

అమ్మా అనే పిలుపుచాలు చాలు..



23 ఏళ్లుగా పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నాను. ఉదయాన్నే లేచి రోడ్ల పైకి వస్తాం. పరిసరాలను పరిశుభ్రం చేస్తాం. ఈ పని చేయడంలో ఎంతో సంతృప్తి ఉంది. అందరూ నన్ను అమ్మా ప్రేమతో పిలుస్తారు. అంతకంటే ఈ జన్మకు ఏం కావాలి...? ప్రస్తుతం తోటపాలెం రోడ్డులో పనిచేస్తున్నా. ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవు. ఎంతో ఆనందంగా ఉన్నాను.

-నల్లపిల్లి సీతమ్మ, పారిశుధ్య కార్మికురాలు, శ్రీకాకుళం

కుటుంబ.. డ్యూటీ నా రెండు కళ్లు



నేను నరసన్నపేట మేజర్ పంచాయతీలో 15ఏళ్లుగా కాంట్రాక్టు పారిశుధ్య కార్మికురాలుగా పనిచేస్తున్నాను. డ్యూటీకి వెళ్తే రోజుకు సుమారు రూ. 600 వస్తుంది. కుటుంబం కోసం రోజూ పనికి వెళ్తాను. నాకు కుటంబం.. డ్యూటీ రెండు కళ్ల లాంటివి.

-శాంతమ్మ, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికురాలు

వెన్నుపూస దెబ్బతింది..



పదేళ్ల కిందట వరకు నా భర్త ఈ పని చేసేవారు. ఆయన మృతిచెందిన తరువాత ఆ పని నాకు ఇచ్చారు. నాలుగేళ్ల కిందట వీధిలో చెత్త ఊడు స్తుండగా జారిపడ్డాను. వెన్నుపూస దెబ్బతింది. ఆపరేషన్ చేయించుకున్నాను. కానీ, రూపాయి కూడా పంచాయతీ నుంచి ఇవ్వలేదు. సొంత డబ్బులతో వైద్యం చేయించుకున్నాను. ప్రస్తుతం బీపీ, షుగర్‌తో బాధపడుతున్నాను. వచ్చిన జీతం వైద్యం, మందులకు సరిపోతున్నాయి. కుటుంబం గడవడం కష్టంగా ఉంది. బతుకు బండి ముందు సాగేందుకు కష్టమైనా.. కాళ్లు కూడబెట్టుకొని ముందుకు సాగుతున్నాను.

-బొమ్మాళి పార్వతి, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికురాలు, నరసన్నపేట

కష్టమైనా చేస్తున్నాం..



గత 12 ఏళ్లుగా పారిశుధ్య పనులు చేస్తున్నాను. చెత్త తీయడం, ఎత్తడానికి అలవాటు పడ్డాం. ఇతర పని చేత కాదు. అందుకే కష్టమైనా ఈ పని చేస్తున్నాం. కనీసం మాకు నూనెలు, సబ్బులైనా ఇవ్వడం లేదు. ఏడాదికి ఒకమారు నిత్యావసర సరుకులు ఇస్తారు. జీతం సరిపోవడం లేదు. కుటుంబం నడిపించేందుకు ఇదే పనులు చేస్తున్నాం.

-బోగేష్, పారిశుధ్య కార్మికుడు, నరసన్నపేట

సౌకర్యాలు లేవు..



పారిశుధ్య కార్మికులకు కనీస సౌకర్యాలు లేవు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలిలో వణుకుతూ పనులు చేస్తాం. అయినా చేతికి, ముక్కుకు పెట్టుకునేందుకు మాస్కులు, గ్లౌజులు కూడా ఇవ్వరు. కంపు అయినా భరించి చేయాల్సిందే. పారిశుధ్య కార్మికులకు వైద్య, ఇతర సదుపాయాలు కల్పించాలి.

-నమోనారాయణ, పారిశుధ్య కార్మికుడు, నరసన్నపేట

చాలా కష్టంగా ఉంది..

నేను ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో ఒప్పంద కార్మికునిగా గత నాలుగేళ్లుగా పని చేస్తున్నా. నాకు రోజుకి రూ.250 చొప్పున ఇస్తారు. ఈ డబ్బులతో కుటుంబాన్ని పోషించుకోవడం చాలా కష్టంగా ఉంది. ఇతర పనులు చేయడం చేతకాక ఈ పనికి వస్తున్నా.

-సుష్మా ప్రదీప్, ఇచ్ఛాపురం



ఈమె పేరు **జంగం అరుణ**. పలాస ప్రభుత్వ ఆసుపత్రి పారిశుధ్య ముఖ్య కార్మికు రాలిగా పనిచేస్తుంది. 15 ఏళ్ల నుంచి పనిచేస్తున్నా ఆమెకు లభించే వేతనం నెలకు కేవలం రూ.9 వేలు మాత్రమే. రూ.1500తో ఉద్యోగం ప్రారంభించి ప్రస్తుతం పెరిగిన నామమాత్రపు వేతనంతో కుటుంబాన్ని పోషించుకుంటుంది.



వాలీబాల్, హ్యాండ్‌బాల్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

వేసవి క్రీడా శిబిరాలు సిద్ధం

- జిల్లాలో 50 కేంద్రాలు ఏర్పాటు
- నేటి నుంచి ప్రారంభం

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు సిద్ధమయ్యాయి. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో 50 శిబిరాలు నిర్వహించాల్సి ఉంది. దీంతో ఇప్పటికే క్రీడా సంఘాలు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘంతో సమావేశం ఏర్పాటు చేశారు. ఏఏ కేంద్రాల్లో ఏ క్రీడంశాలకు నిష్ణాతులైన వారు శిక్షణ ఇస్తున్నారన్నది నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో అన్ని మండలాల్లో అన్ని క్రీడంశాలు వ్యాపించే విధంగా సర్దుబాటు చేశారు. గురువారం నుంచి ఇవి ప్రారంభంకానున్నాయి. వాలీబాల్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్‌తోపాటు 21 క్రీడంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ శిక్షణ శిబిరాలను గురువారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. వేసవిలో 15 ఏళ్లలోపు విద్యార్థులు ఎటువంటి చెడు అల వాట్లు, మొబైల్ వంటి వాటిపై దృష్టి మళ్లించకుండా ఉండేందుకు ప్రతి ఏటా ఈ శిబిరాలు నిర్వహిస్తుంటారు.

రూ.7 వేలు కేటాయింపు..

నెల రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. ఒక్కొక్క శిబిరానికి శాప్ రూ.7వేలను కేటాయించింది. రూ.5వేలు క్రీడా సామగ్రి కొనుగోలుకు, ఫ్లెక్సీలు ఇతర అవసరాలకు రూ.500, గౌరవ వేతనం కింద రూ.1,500 కేటాయించారు. ఈ శిబిరాలను ఆయా కేంద్రాల దరిలో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల సహాయంతో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

కేంద్రాలు ఇవే..

అథ్లెటిక్స్‌కు ఏడు కేంద్రాలు, బ్యాడ్మింటన్-1, బాల్ బ్యాడ్మింటన్-2, బాస్కెట్ బాల్-1, బేస్ బాల్-1, బాక్సింగ్-2, చెస్-1, క్రికెట్-1, ఫెన్సింగ్-1, ఫుట్‌బాల్-3, హ్యాండ్‌బాల్-3, జూడో-2, కబడ్డీ-4, ఖోఖో-3, సపక్ టక్రా-1, సాఫ్ట్‌బాల్-3, టేబుల్ టెన్నిస్-1, తైక్వాండో-2, టెన్నికాయిట్-2, వాలీబాల్-4, వెయిట్ లిఫ్టింగ్-2, ఉషు-1 కేంద్రాల్లో తర్ఫీదునిస్తారు.

నకిలీల సదరం

(ఐదో పేజీ తరువాయి)

విషయంపై ఈ ఏడాది ఫిబ్రవరి 19న రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ డైరెక్టర్ అట్టాడ సిరి నోటీసులు జారీ చేశారు. ఈ వ్యవహారంపై వ్యక్తిగతంగా సమగ్రంగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అయితే ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన ఒక వైద్యుడు రాజకీయ అండతోనే శాఖపరంగా ఎటువంటి చర్యలు తీసుకోకుండా అడ్డుకట్టు వేశారని సమాచారం. తాజాగా పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీటు దాఖలు చేయడంతో వైద్యులు పరుగులు పెడుతున్నారు. కొందరు తామేమి తప్పు చేయలేదని.. ఈ వ్యవహారంలో డిజటల్ కీ ఉపయోగించి అంగవైకల్యం నిర్ధారించే డాక్టర్, డేటా ఆపరేటర్ కలిపి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారని ఆరో పిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. తమను కాపాడేందుకు సమీప బంధువులు ఉన్నారని.. కొందరు వైద్యులు డాంబీకాలు చెబుతున్నారు.

అజ్ఞాతంలో డేటా ఆపరేటర్

నరసన్నపేట సామాజిక ఆసుపత్రిలో సదరంలో నకిలీ దివ్యాంగుల పత్రాలు జారీ వ్యవహారం బయటపడిన తరువాత డేటా ఆపరేటర్ సి.శ్రీనివాసరావు అజ్ఞాతంలోకి వెళ్లారు. దీంతో ఈ వ్యవహారాన్ని డేటా ఆపరేటర్ మీదకు నెట్టేసి.. తప్పించుకునేందుకు కొంతమంది వైద్యులు కథ నడిపిస్తున్నట్లు సమాచారం.

- మామిడి పంటపై తీవ్ర ప్రభావం
- నేలకొరిగిన వరిపంట

ఈదురు గాలుల బీభత్సం



ఎల్ఎన్‌పేట: నేలరాలిన మామిడిపంటను పోగుచేసి చూపిస్తున్న కోటిపల్లి రాము

ఎల్.ఎన్.పేట/జలుమూరు/నరసన్నపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పలు ప్రాంతాల్లో పడింది. సుమారు రెండు గంటల పాటు ఈదురుగాలులు వీయడంతో వరి చేలు నేలకొరగగా, మామిడి కాయలు రాలిపోయాయి. దీంతో రైతులు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తంచేశారు.



జలుమూరులో గాలులకు నేల రాలిన మామిడి కాయలు

ఈదురుగాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇక్క ట్లకు గురయ్యారు. ● ఎల్ఎన్‌పేట మండలంలోని లక్ష్మినర్సుపేట, దబ్బపాడు, మిరియాపల్లి, సిద్ధాంతం, కరకవలస, బొర్రంపేట, జోగివలస, చొర్లంగి, కొత్తజోగి తదితర గ్రామాల్లో మామిడి పంట నేలరాలిపోయింది. వారం పది రోజుల్లో పంట చేతికి అందివచ్చే సమయంలో భీకర గాలులు నష్టాన్ని మిగిల్చాయని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ● జలుమూరు మండలం కరకవలస, శ్రీముఖలింగం, నగిరికటకం, మెట్టపేట, మర్రివలస, అచ్యుతాపురం, కొమనాపల్లి, తిమడాం, సురవరం, దొంపాక, అల్లాడ, రామదాసుపేట, పర్లాం గ్రామాల్లో మామిడి పంట పరిపక్వ దశకు వచ్చే సమయంలో ఈదురుగాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. మండలంలో 100 ఎకరాలు మామిడి తోటల్లో నష్టం సంభవించినట్లు రైతులు వాపోతున్నారు. ● నరసన్న పేట మండలం జమ్ము, పొన్నానపేట, రావాడపేట, తామరాపల్లి, దశుమంతుపురం తదితర గ్రామాల్లో మామిడి రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. పంట చేతికి అందే సమయంలో ఇలా గాలులతో నష్టం వాటిల్లిందని మామిడి రైతులు గగ్గోలు చెందుతున్నారు. దాసరివాని పేట, జల్లువానిపేట వద్ద చెట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోగా పలు గ్రామాల్లో రబీలో పండిన ధాన్యం తడిచిపోయాయి.



ఎల్ఎన్‌పేట: చింతలబడవంజలో నేలకొరిగిన వరిచేలు



నరసన్నపేట: రాలిన మామిడి కాయలను చూపుతున్నరైతు సబ్బలక్ష్మి

ప్రజల దాహం కేకలు వినిపించవా?

● తాగునీటి సమస్యపై అధికారులను నిలదీసిన కౌన్సిల్ సభ్యులు





తాగునీటిపై అధికారులను నిలదీస్తున్న సభ్యులు, సమాధానం చెబుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): 'మున్సిపాల్టీ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతుంటే అరకొరగా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ప్రజల దాహం కేకలు వినిపించటం లేదా?' అని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్యతోపాటు కౌన్సిల్ సభ్యులు అధికారులను నిలదీశారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. అజెండాల్లో ఉన్న 12అంశాలపై చర్చ జరగ్గా కొన్ని అంశాలపై కౌన్సిల్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో మూడు ఏసీలు ఏర్పాటుకు రూ2.30లక్షలు సాధారణ నిధులు కేటాయించి కౌన్సిల్ ఆమోదం కోరగా, ఏసీల కొనుగోలుకు అంత డబ్బు ఎందుకు? ఎక్కడ ఏర్పాటు చేస్తారని వైస్ చైర్‌పర్సన్ భారతి దివ్య అధికారులను ప్రశ్నించారు. కులాయిల ద్వారా నీరు సరఫరా కావడం లేదని, మూడునెలల కులాయి పన్ను రద్దు చేయాలని, పూర్తిస్థాయిలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని 8వ వార్డు కౌన్సిలర్ పల్లంటి మధుమూర్తి కోరారు. ట్యాంకర్లను పెంచి 23 వార్డులకు పూర్తిస్థాయిలో తాగునీరు అందివ్వాలని కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్, జి.శేఖర్, ఆశి లీలారాణి, ప్రదీప్, మధుమూర్తి, భారతిదివ్య, కాళ్ల వెంకటలక్ష్మితోపాటు మిగతా కౌన్సిల్ సభ్యులు కోరారు. దీనిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ.. ప్రస్తుతం ఆరు ట్యాంకర్లు ఉన్నాయని, ఒక్కోదానితో ఏడు ట్రిప్పులు చొప్పున రోజుకి 48 ట్యాంకర్ల నీటిని ప్రజలకు అందిస్తున్నట్లు వివరించారు. అంతా సహకరించాలని చైర్‌పర్సన్ రాజలక్ష్మి, కమిషనర్ ఎన్.రమేష్ కోరారు.

వీఆర్‌ఏల వేతనాలు పెంచాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏలకు వేతనాలు పెంచాలని, వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, వీఆర్‌ఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు అల్లు సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.త్రినాథరావు, కె.రమణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని, నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలని అన్నారు. తొలుత ఆర్‌అండ్‌బీ బంగ్లా రోడ్డు నుంచి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

ఘనంగా బసవేశ్వర జయంతి



బసవేశ్వరుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ తదితరులు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కుల, లింగ, వర్ణ విభేదాలను వ్యతిరేకించిన మహాత్మా బసవేశ్వరుని తత్వాలు దేశవ్యాప్తంగా ప్రభావం చూపాయని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బసవేశ్వరుని జయంతిని ఘనంగా నిర్వహించారు. బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాల వేసి జేసీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12వ శతాబ్దపు తత్వవేత్తగా బసవేశ్వరుడు సమానత్వాన్ని బోధించారని, అనుభవ మంటపం స్థాపించారని అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



శివాజీ పాణిగ్రాహిని సత్కరిస్తున్న విప్ అశోక్

కవిటి, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగిగా ప్రజలకు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ అన్నారు. కవిటి మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో శివాజీపాణిగ్రాహి పదవీ విరమణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం శివాజీపాణిగ్రాహి, అరుణ దంపతులను సత్కరించారు. జడ్పీ చైర్‌పర్సన్ పి.విజయ, ఎమ్మెల్సీ ఎన్.రామారావు, ఎంపీపీ కె.పద్మ, ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ మురళీమోహన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరిస్తా

ఆమదాలవలస, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మాజీ సైనికుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ, ఆంధ్ర ఆసబ్ ఏరియా హెడ్ క్వార్టర్స్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా అన్నారు. బుధవారం కొత్త రోడ్డు దగ్గర ఉన్న ఆర్మీ క్యాంటీన్‌ను ఆయన సందర్శించారు. జిల్లాలోని ఉన్న మాజీ సైనికులు, వీరనారీమణులకు ఉపయోగపడే విధంగా ఒక ఈ-రిక్షా అందించనున్నట్టు ప్రకటించారు. అనంతరం ఏడుగురు విజేస్ మహిళలకు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కల్నల్ విక్రాంత్ పాండే, కల్నల్ ఆర్.ఎన్.ముతల్లిక్, జిల్లా ఎక్స్‌సర్వీస్‌మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం చైర్మన్ పి.ఈశ్వరరావు, జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ ఎ.శైలజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా

ఆదిత్యుని సన్నిధిలో పూజలు..

అరసవల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సూర్యనారాయణ స్వామిని ఆర్మీ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో వైభద్రాజీ స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు.

శ్రీకూర్మనాథుని కల్యాణానికి పందిరిరాట

గార, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వ తేదీన జరగనున్న శ్రీకూర్మనాథుని కల్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం ఆలయం వద్ద పందిరిరాట వేశారు. ఈవో కె.నరసింహనాయుడు, ఆలయం ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు, ఇతర అర్చక, వైదిక స్వాములు పాల్గొన్నారు.



పందిరిరాట వేస్తున్న అర్చకులు

ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత

కవిటి, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. బుధవారం చిన్నకర్రివానిపాలెంలో జరిగిన తారక నామ మహామంత్ర యజ్ఞంలో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

సింహాచలం ఘటన బాధాకరం

బూర్జ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో విషాదం చోటు చేసుకోవడం బాధాకరమని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.

సబ్సిడీపై పశు దాణా

బూర్జ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖ ద్వారా పాడి రైతులకు 50 శాతం సబ్సిడీపై 50కేజీల పశు దాణాను రూ.555కే అందిస్తున్నట్లు పశు వైద్యాధికారి వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బూర్జ మండలానికి జనరల్ కేటగిరీ కింద 120 బస్తాలు, ఎస్సీ కేటగిరీ కింద 33 బస్తాలు కేటాయించినట్లు చెప్పారు. దాణా కావాల్సిన పాడి రైతులు సమీప రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

4 నుంచి దశకోటి మహాయజ్ఞం మహోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈ4నెల నుంచి శ్రీరామ నామ దశకోటి మహాయజ్ఞం మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉపనిషన్మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్ తెలిపారు. టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 4న సీతారామ కల్యాణం, భక్తి సంగీత విభావరి, 5న సువర్చల ఆంజనేయ స్వామి కల్యాణం, రుద్రాభిషేకాలు, 6న రామకోటి పుస్తకాలతో శోభాయాత్ర, హనుమాన్ చాలీసా అఖండ పారాయణం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

కొత్తపేట రోడ్డుకు నిధులు

ఎచ్చెర్ల, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): తోటపాలెం జంక్షన్ నుంచి కొత్తపేట మీదుగా అంబేడ్కర్ నగర్ (మాలముద్దాడ) వరకు 5.2 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్లు నాబార్డు నిధులు మంజూరయ్యాయని ఏఈ హేమలత తెలిపారు. ఈ మేరకు టెండర్లు ఖరారైన తర్వాత పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఎచ్చెర్ల శాసనసభ్యుడు నడుకుదిటి ఈశ్వరరావు స్పందించి నాబార్డు నిధులు మంజూరుకు చొరవ చూపడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

శివానీ విద్యార్థుల ప్రతిభ

● ఎలక్ట్రికల్ వ్యాన్ తయారీ

ఎచ్చెర్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం) మెకానికల్ బ్రాంచ్ నాలుగో సంవత్సర విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా ఎలక్ట్రికల్ వ్యాన్‌ను తయారు చేశారు. పాత పెట్రోల్ ఇంజిన్ వ్యాన్‌ను తీసుకుని దానిని సమూలంగా బ్యాటరీ ఆధారిత రవాణా వాహనంగా రూపొందించారు. దీనికోసం రూ.2 లక్షలను కళాశాల యాజమాన్యం సమకూర్చింది. ఈ వాహనాన్ని మెకానికల్ విభాగాధిపతి ఎస్.లక్ష్మణరాజు పర్యవేక్షణలో విద్యార్థులు సుశీల్ శ్రీనివాస్, రేవంత్, శంకరరావు, సాగర్, రామ్మోహన్‌నాయుడు, నరేష్, చంద్రశేఖర్ తయారు చేశారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జీటీ చంద్రశేఖర్, యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆమదాలవలస, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటాడ, దూసి, అక్కివరం, వంజంగి గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామాల్లో చెట్ల కొమ్మలు తొలగించడం, విద్యుత్ లైన్ల నిర్వహణ కోసం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

కిటకిటలాడిన బంగారు దుకాణాలు



ఓ దుకాణంలో బంగారం కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం ఇచ్ఛాపురం పట్టణంలోని అన్ని బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మహిళలు లక్ష్మీదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంగారు దుకాణాలకు వెళ్లి వస్తువులు కొనుగోలు చేసేందుకు పోటీపడ్డారు. అక్షయ తృతీయ రోజున పసిడిని కొనుగోలు చేస్తే ఏడాది మొత్తం బంగారం కొనుగోలు చేస్తామని మహిళల నమ్మకం.

ఏపీపీఎస్సీ మెయిన్స్ షెడ్యూల్ మార్చాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను మార్చాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోష్, కొన్న శ్రీనివాస్, టౌన్ నాయకుడు వై.వేణు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష ఈ నెల 25న, మెయిన్స్ ఆగస్టు చివరి వారంలో ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నెల మొదటి వారంలో జరగనున్న ఏపీపీఎస్సీ పరీక్షను ఈ ఏడాది సెప్టెంబరు/అక్టోబరుకు వాయిదా వేయాలని కోరారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయాలి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో మహిళలతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయాలని ఏపీఎం ఎస్.ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘం సహాయకులు, సీసీలు, రైతు ఉత్పత్తిదారుల సమైఖ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మండలంలో 162 సంఘాలు ఉన్నాయని తెలిపారు. కనీసం 300 సంఘాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

మెరైన్ సీఐ పల్లెనిద్ర

సోంపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎకువూరు గ్రామంలో బారువ మెరైన్ సీఐ డీజీజే రమేష్‌కుమార్ మంగళవారం రాత్రి పల్లెనిద్ర చేశారు. గ్రామపెద్దలతో కలసి మత్స్యకారుల సమస్యలు అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సూరాడ బైరాగి, చీకటి హరినారాయణ, తోట భోగరాజు తదితరులు ఉన్నారు.

మద్యం సీసాల పట్టివేత

ఆమదాలవలస, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దాడపేట గ్రామానికి చెందిన కంచరాపు నీలంనాయుడు ఇంటిలో 55 మద్యం సీసాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వాటిని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ బాలరాజు కేసు నమోదు చేశారు.

వైభవంగా చందనోత్సవం



స్వామికి పూజలు చేస్తున్న వేదపండితులు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దాసన్నపేట జంక్షన్ వద్ద ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం చందనోత్సవం వైభవంగా జరిగింది. వేకువ జాము నుంచే స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి చందనంతో అలంకరించారు. అనంతరం ప్రధాన వేద పండితులు సన్యాసిపాడి.. విష్ణు సహస్ర నామాలు, ఇతర పూజలు జరిపారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ● మార్కెట్ జంక్షన్‌లోని సత్యనారాయణ స్వామి దేవాలయంలో కూడా చందనోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనువాస్‌పండా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిజరూప దర్శనం



లక్ష్మీనరసింహస్వామి నిజరూప దర్శనం

ఆమదాలవలస, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి):సైలాడ పంచాయతీ దివంజిపేటలోని లక్ష్మీనరసింహస్వామి నిజరూప దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఆలయ అర్చకులు మురపాక ప్రకాష్‌శర్మ, రాహుల్‌శర్మ, నవీన్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

శ్రీకాకుళం తుమ్మావీధిలో..



పూజలందుకున్న లక్ష్మీనరసింహుడు

శ్రీకాకుళంకల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం శ్రీకాకుళం తుమ్మావీధిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చందనోత్సవం నిర్వహించారు. చందనం తొలగించి స్వామి నిజరూప దర్శనాన్ని భక్తులకు కల్పించారు. మొండేటివారి వీధిలోని షిరిడీ సాయి ఆలయంలో లక్ష్మీగణపతికి చందనోత్సవ పూజలు నిర్వహించారు.

చెవిటమ్మ తల్లి వృక్ష ప్రతిష్ఠ



పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న పండితులు

గార, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సిమ్మపేట గ్రామంలో బుధవారం చెవిటమ్మతల్లి వృక్ష ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. వేలాదిగా భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమం జరిపించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ చేశారు.

పురుషోత్తపురంలో కుంకుమ పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

కంచిలి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపురం, చిలకలమెట్ట గ్రామాల్లో భూలోకమాత, నిమ్మశిని, చండమ్మ పంచ దేవతల ఆలయాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బుడ్డెపు కామేష్ రెడ్డి, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బలగ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. అర్చకులు దేవరకొండ శంకర్ నారాయణ శర్మ, ఆలయ ధర్మకర్త దానేటి రాజారావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నక్కవీధిలోని ఉమాజఠకేశ్వరాలయంలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి 12వ వార్షికోత్సవ పూజలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


క్షతగాత్రుడికి సపర్యలు చేస్తున్న హైవే సిబ్బంది

పలాస, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): చిన్ననీలావతి గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన సొర్ర గణపతి, సొర్ర తంబయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ద్విచక్ర వాహనంపై వెళుతున్న వీరిని వెనుక నుంచి గుడ్లు తరలిస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి..

నందిగాం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సుభద్రాపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన దుక్క కృష్ణారావుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కృష్ణారావు ఉపాధి పనికి వెళ్లేందుకు ఇంటి నుంచి నందిగాం వచ్చే మార్గంలో నడుచుకుంటూ వస్తుండగా అదే మార్గంలో రాంగ్ రూట్‌లో వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో కృష్ణారావు ఎడమకాలు విరిగిపోగా శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయ. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి హైవే అంబులెన్స్‌లో తరలించారు. నందిగాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఢీకొని..

నరసన్నపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉర్లాం రైల్వేస్టేషన్ వద్ద ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఢీకొనికొత్తపొలవలసకు చెందిన తలగాన గోవిందరావు తీవ్రంగా గాయపడినట్లు రైల్వే పోలీసు అధికారి మధుసూదనరావు తెలిపారు. బుధవారం ఉదయం పట్టాలు దాటుతున్న సమయంలో ఈప్రమాదం జరిగిందని, వెంటనే క్షతగాత్రుడిని 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చేర్పించడం జరిగిందన్నారు. ఈతడు అపస్మారక స్థితిలో ఉన్నట్లు జీఆర్‌పీ హెచ్‌సీ తెలిపారు. ప్రమాదం జరిగిన తీరుపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కోటబొమ్మాళి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడు గ్రామానికి చెందిన పినిమింటి లక్ష్మి (37) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచ ఎందినట్లు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఆయన పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి.. భర్త రామారావు నిత్యం మద్యం సేవించి భార్య, పిల్లలతో గొడవ పడేవాడు. లక్ష్మి ఇంటిలో ఉంచిన నగదును ఈనెల 27న భర్త తీసుకువెళ్లి తాగివచ్చి గొడవకు దిగాడు. దీంతో భార్య మనస్తాపానికి గురై ఇంటిలో ఉన్న చీమల మందును నీటిలో కలుపుకుని తాగింది. వెంటనే గుర్తించిన గ్రామ స్థులు ఆమెను తొలుత కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి, అక్కడి వైద్యుల సిఫారసు మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి దాసరి నీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఉద్యోగికి చేసిన సేవలే గుర్తింపునిస్తాయి


రమణయ్యను సత్కరించిన దృశ్యం

జలుమూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికి తాను చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంఈవో బి.మాధవరావు అన్నారు. పాగోడు ఉన్నత పాఠశాలలో బయాల జీ స్కూల్ అసిస్టెంట్ పాగోటి రమణయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం పాఠశాలలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి ఎంతోమంది పిల్లలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దిన రమణయ్య అభినందనీయులన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రసాదరావు, హెచ్ఎం కోటిబాబు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి

టెక్కలి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణా శిబిరాలను విద్యార్థులు వినియోగించు కోవాలని ఎంఈవో డి.చిన్నారావు కోరారు. స్థానిక మండాపొలం కాలనీలో ప్రజాచైతన్య కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ.. భగవద్గీత పరిచయం, యోగాభ్యాసం, తెలుగు, గణితం, ఆంగ్లంలో నైపు ణ్యం పెంపొందించడంతో పాటు ఆట, పాటల ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసానికి శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు డీఏ స్టాలిన్, మూల తాతయ్య, యు.గణపతిరావు, ఎ.చిట్టెన్న, చిలుకు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వంశధార కాలువ ఆక్రమణలు తొలగించాలి

టెక్కలి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): టెక్కలి సమీపంలో 49/1ఆర్ కాలువను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించడంతో బుధవారం రెవెన్యూ, వంశధార అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. ఈఈ బి.శేఖరరావు, డీఈఈ నవీన్, సుధాకర్, జేఈ భాస్కరరావు బృందం రెవె న్యూ అధికారులతో కలిసి సర్వే చేసి గుర్తించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొంతమేర వంశ ధార కాలువ స్థలం ఆక్రమణ చేశారని గుర్తించారు. ఆక్రమణపై టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వంశధార ఈఈ శేఖరరావు తెలిపారు. వారం రోజుల్లో ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

104 వాహనాల పనితీరు మెరుగుకు చర్యలు

నరసన్నపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 104, 108 వాహనాల పనితీరు మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయ అధికారి డా.పి.ప్రవీణ్ అన్నారు. బుధవారం పట్టణంలో 104, 108 వాహనాలు కండిషన్, పరికరాల పనితీరును పరిశీలించారు. అరబిందో నుండి భవ్య హెల్త్ సర్వీస్‌కు వాహనాలను అప్పగించనున్న నేపథ్యంలో ఆడిటింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. భవ్య హెల్త్ సర్వీస్ ఆడిటర్ బి.సంతోష్‌కుమార్, ఓఈ లక్ష్మణరావు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగునీరు


రోడ్డుపై నిలిచిపోయిన మురుగునీరు

హిరమండలం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): హిరమండలం సుభలయ పల్లివీధిలో కాలువల నుంచి మురుగు నీరు వెళ్లేందుకు అవకాశం లేక రోడ్డు పైనే నిలిచిపోతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో నడిచేందుకు కూడా అవకాశం లేదని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గ్రామాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

వివిధ గ్రామాల్లో ఆలయాల ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు, వార్షికోత్సవాల నేపథ్యంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. బుధవారం విశేష పూజలు, హోమాలు, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవం


లక్ష్మీనరసింహస్వామి విశేష అలంకరణ

నందిగాం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నందిగాం మదుర సుబ్బమ్మ పేటలో కొలువై ఉన్న లక్ష్మీ నరసింహస్వామి వారి చందనోత్సవం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. ఏటా వైశాఖ శుద్ధ తదియ నాడు స్వామి వారి చందనోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా ధర్మకర్త కె.రంగనాథన్ ఆధ్వర్యంలో బాలసీమకు చెందిన వేదపండితులు చామర్తి శ్రీనివాసా చార్యులు, ఆలయ అర్చకులు కె.రామానుజా చార్యులు, ఇతర రుత్వికుల ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, చందనం తొలగించి నిజరూప దర్శనం కల్పించారు. సాయంత్రం వేదమంత్రాల మధ్య చందనం పూత కార్యక్రమం శాస్త్రోక్తంగా చేపట్టారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు

నందిగాం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సైలాడ పంచాయతీ దేవాడలో పాతపట్నం అమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం పురోహితుడు బూరాడ విశ్వగురు శర్మ నేతృత్వంలో మహిళ లతో సామూహిక కుంకుమార్చనలు చేయించారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠతో పాటు అన్నప్రసాద వితరణ, కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.


దేవాడలో సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

నందిగాం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురం పంచాయతీ పాతినివాని పేటలో కనక దుర్గ మ్మ ఆలయ పదో వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరి గింది. పురోహితుల పర్యవేక్షణలో గ్రామస్థులు విశేష పూజలు, పంచామృతాభిషేకాలు, లలితా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

గీతామందిరంలో ప్రత్యేక పూజలు

నరసన్నపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక గీతామందిరంలో అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సహిత మలయప్ప స్వామికి ప్రత్యేకంగా అలంకరించారు. రుత్వికులు పీసపాటి సూరిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే యారబాబు, దాసరివానిపేట గ్రామాల్లో నీలమ్మతల్లి ప్రతిష్ఠోత్సవాలను ఘనంగా నిర్వహించారు.


గోవిందపురంలో భూమిపూజ చేస్తున్న గ్రామస్థులు

పాలపోలమ్మ గుడి పునర్నిర్మాణానికి భూమి పూజ

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పూండి గోవిందపురంలో పాలపోలమ్మ గుడి పునర్నిర్మాణానికి బుధవారం గ్రామస్థులు భూమి పూజ నిర్వహించారు. పాత గుడిని తొలగించి దాని స్థానంలో కొత్తగా నిర్మాణం చేపట్టనున్నట్లు అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వుచ్చ ఈశ్వరరావు తెలిపారు. గ్రామస్థుల సహకారంతో ఈ నిర్మాణం చేపడుతున్నామన్నారు. స్థానికులు పాల్గొన్నారు.


నరసన్నపేట: మలయప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రుత్వికులు

రాజారాంపురంలో జెట్టీ ఏర్పాటుకు కృషి



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సాగర తీర గ్రామం రాజారాంపురంలో మత్స్యకారుల సౌకర్యం కోసం జెట్టీని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం సాయంత్రం మత్స్యకారుల వేటనిషేధ భృతి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో మత్స్యకార గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేసింది గత టీడీపీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వమేనని గుర్తు చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మత్స్యకార గ్రామాలను నిర్లక్ష్యం చేశారన్నారు. వేట నిషేధ భృతి రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచి సీఎం చంద్రబాబు నాయుడు మత్స్యకారులను ఆదుకున్నారన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభు త్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మిరియబ్బిల్లి వెంకల అప్పలనాయుడు, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, టీడీపీ నేతలు బైరి భాస్కరరావు, షైలపల్లి త్రినాథరావు, కోడ తాతారావు, లక్ష్మీపతి, సూరపు నారాయణదాస్, సర్పంచ్ ప్రతినిధి యాపర ధర్మారావు, ఎంపీటీసీ మూర్తి, తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్, కూటమి నేతలు పాల్గొన్నారు.

చైర్మన్‌కు తెలియకుండా శంకుస్థాపనలా?

- సమావేశం నుంచి వైసీపీ కౌన్సిలర్ల వాకౌట్


సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్న వైసీపీ కౌన్సిలర్లు

పలాస, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ చైర్మన్‌కు తెలియకుండా పవర్‌బోర్ పనులకు శంకుస్థాపన చేయడం తగదని, సభ్యులకు కనీసం గౌరవం ఇవ్వని సమావేశాలు ఎందుకని వైసీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. బుధవారం చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన మునిసిపల్ సమావేశం నిర్వహించారు. 26వ వార్డులో పవర్‌బోర్‌కు అక్కడి కౌన్సిలర్ (టీడీపీ) టి.ఆశారాణి, కమిష నర్ ఎన్.రామారావు ఇటీవల శంకుస్థాపన చేశారని, చైర్మన్‌గా తనకు కనీసం సమాచారం ఇవ్వలేదని ఆయన సభలో ప్రస్తావించారు. దీంతో వైసీపీ కౌన్సిలర్లు ఆయనకు మద్దతుగా నిరసన తెలిపారు. మెజార్టీ సభ్యులు ఉన్నా చైర్మన్‌ను అవమానించడం తగదని పేర్కొంటూ సభ నుంచి వాకౌట్ చేశారు. అంతకు ముందు కౌన్సిలర్ గుజ్జు జోగారావు మాట్లాడుతూ.. పనిచేయని కాంట్రాక్టర్లే కొత్తగా పనులకు టెండర్లు వేశారని, పాత పనులే చేయలేని వారు కొత్తగా ఏ విధంగా చేస్తారని ప్రశ్నించారు. మొత్తం పనులు రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలవాలని సూచించారు. దీనిపై చైర్మన్ గిరిబాబు మా ట్లాడుతూ.. సదరు కాంట్రాక్టర్ టెండర్లన్నీ వాయిదా వేద్దామన్నారు. దీనిపై టీడీపీ కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ.. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ట్యాంకర్ల ద్వారా నీరు సర ఫరా చేయాల్సి ఉందని, టెండర్లు రద్దు చేస్తే నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడతారని, దీనిపై సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు. పనులు చేయకపోతే ఇంజనీర్లే బాధ్యత వహించాల్సి ఉందన్నారు. ఈ విషయమై కమిషనర్ ఎన్.రామారావు మాట్లాడుతూ.. వాస్తవాలు సభకు తెలియజేస్తామని చెప్పినా సభ్యులు వినలేదు. వచ్చే సమావేశంలో ఈ అంశాలు చర్చించడం జరుగుతుందని చైర్మన్ ప్రకటించారు.

అటవీ ప్రాంతంలో విజిలెన్స్ తనిఖీ


హొన్నాళి అటవీప్రాంతంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హరిపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ అటవీ రేంజి మందస సెక్షన్ హొన్నాళి అటవీ ప్రాంతంలో విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు ఆధ్వ ర్యంలో సంబంధిత అధికారులు బుధవారం తనిఖీ చేపట్టారు. ఏప్రిల్ 21న 'మొక్కల పేరుతో మెక్కేశారు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి విజిలెన్స్ అధికారులు స్పందించారు. విజిలెన్స్ డీజీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు దర్యాప్తు నిర్వహించారు. రికార్డులో నమోదు చేసి పనులు జరిగియా లేదా అనే అంశాలు, ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు వారు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ వై.గోవిందరావు, డీఈ ఈ సత్యనారా యణ, జియాలజిస్ట్ సురేష్ కుమార్, ఏఈ గణేష్, పలువురు అటవీశాఖాధికారులు పాల్గొన్నారు.

రూ.10 కోట్లతో టూరిజం పార్కు అభివృద్ధి

- మదనగోపాల సాగరాన్ని సర్వే చేసిన అధికారులు


సర్వే చేస్తున్న అధికారులు

టెక్కలి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): టెక్కలి సమీపంలోని 224 ఎకరాల విస్తీర్ణం ఉన్న మదన గోపాలసాగరాన్ని టూరిజం పార్కుగా అభివృద్ధి చేసేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు బుధవారం ఉమ్మడిగా సర్వే నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మదన గోపాల సాగరాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించి దిశ నిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో వంశధార ఈఈ బి.శేఖరరావు, ప్రైవేట్ టూరిజం ఏజెన్సీ ప్రతినిధి బృందం జాతీయ రహదారి పక్కన ఉన్న మదన గోపాల సాగరాన్ని పరిశీలించారు. రిసార్ట్స్ లోపల 50 ఎకరాల్లో బోటు షికార్, జలాశయం గట్టు బ్యూటిఫికేషన్ యుద్ధ ప్రాతిపదికన చేయించేందుకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించామని, ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని ఈఈ శేఖరరావు తెలిపారు.

చెత్త సంపద కేంద్రాలు వినియోగించాలి


జలుమూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్పీవో ఐవీ రమణ అన్నారు. గుగ్గిలిలో నిర్మించిన కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేంద్రాలను వినియోగించడంలో పంచాయతీలు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయన్నారు. వర్మీ కంపోస్టు తయారీపై గ్రీన్ అంబాసిడర్లకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి కూర్మారావు, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీశ్రీ రచనలు చిరస్మరణీయం


శ్రీశ్రీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కవులు, కళాకారులు

పలాసరూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): విప్లవ రచయిత శ్రీశ్రీ రచనలు చిరస్మరణీయమని, ప్రజల్లో చైతన్యం కలిగించి వారి హృదయాల్లో సముచిత స్థానం పొందారని పలువురు వక్తలు అన్నారు. మాకన్నపల్లిలో ఉద్దానం రచయితల సంఘం (ఉరసం) ఆధ్వర్యంలో శ్రీశ్రీ 115వ జయంతి సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి రచయితలు, కవులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కళాకారుడు, సినిమా నటుడు కుమార్‌నాయక్, అభ్యు దయ రచయిత వంకల రాజారావు మాట్లాడుతూ.. శ్రీశ్రీ సామాజిక, విప్లవ గీతాలతో ప్రజల్లో చైతన్య స్ఫూర్తి రగిలించారన్నారు. ఆయన రచించిన మహాప్రస్థానం అజరామరమన్నారు. అనంతరం పలువురు కవులు, కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ఉరసం ప్రతి నిధులు కుత్తుమ వినోద్, కవి గుమ్మడి సాంబమూర్తి, తెప్పల రవి, కొయిల రామలక్ష్మి, ఎస్.రామారావు, సైని మధు, పి.వెంకటేష్, వెంకటేశ్వరరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

25 మందికి సామూహిక ఉపనయనాలు



కాశీబుగ్గ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జై జగన్నాథ్ ఒడియా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానికంగా 25 మంది ఒడియా వటువులకు సామూహిక ఉపనయనాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి మాట్లాడుతూ.. ఒడియా బ్రాహ్మణులు సామాజికంగా ఉన్నతి సాధించాలని, దీనికోసం నిరంతరం పోరాటం చేయడం జరుగుతుందన్నారు. వటువులకు యజ్ఞోపవీతధారణ చేసి దాని ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ త్యాడి, కార్యదర్శి బాబూరావు పండా, నిత్యానంద పండా, రాఘవ పండా, కామేశ్వర పండా తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

టెక్కలి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక హక్కులపై అవగాహన కల్పించడం జరుగుతుం దని, కార్మికులంతా హాజరు కావాలని ఆమె కోరారు.

కిశోర మనోవికాసమే లక్ష్యం

పాతపట్నం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కిశోర మనోవికాసమే లక్ష్యం కావాలని ఎంపీడీవో పి.చంద్రకుమారి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసంపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మే 2 నుంచి జూన్ 10వ తేదీవరకు గ్రామాల్లో ఈ కార్యక్రమ నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలన్నారు. 15 నుంచి 18 ఏళ్లలోపు వారికి రక్తహీనత, సైబర్ భద్రత , ఆన్‌లైన్ భద్రత, రుతుక్రమ పరిశుభ్రత, లైంగిక విద్య, బాలల హక్కుల రక్షణ తదితర అంశాలపై అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, వైద్య సిబ్బంది, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా బాలకృష్ణ



కొత్తూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా కె.బాలకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హిర మండలంలో డీటీగా పనిచేసిన ఆయన పదోన్నతిపై ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈయన గతంలో ఇక్కడ డీటీగా పని చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది స్వాగతం పలికారు.

5 నుంచి మెట్టూరు బిట్-1లో సర్వే

కొత్తూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం మెట్టూరు బిట్-1 నిర్వాసిత కాలనీలో ప్రభుత్వ రిజర్వు స్థలాల ఆక్రమణ, అనర్హులకు ఇళ్ల పట్టాల మంజూరుపై పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు మే 5 నుంచి సర్వే చేపట్టనున్నామని డీటీ నారాయణరావు తెలిపారు. ఈ మేరకు టెక్కలి ఆర్డీవో ఆదేశాలు జారీ చేశారన్నారు. ముందుగా గ్రామంలో దండోరా వేసి ఫిర్యాదు దారు, ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్వాసితులు తమ వద్ద ఉన్న ఆధారాలతో విధిగా హాజరు కావాలని ఇప్పటికే నోటీసులు అందజేసినట్లు ఆయన తెలిపారు.

సివిల్ న్యాయాధికారికి వీడ్కోలు

నరసన్నపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) నరసన్నపేట కోర్టు సివిల్ న్యాయాధికారి సి.హరిప్రియకు బదిలీ కావడంతో బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో విశ్రాంత న్యాయాధికారి పోగోటి మోహనరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ కొండలరావు, ఏజీపీ గొండు సత్యనారాయణ, రోణంకి కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్గో ఎయిర్ పోర్టుకు వ్యతిరేకంగా 6న కళాజాత

కాశీబుగ్గ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా మే 6న నిర్వహిస్తున్న కళాజాతను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకుడు మద్దిల రామారావు కోరారు. కాశీబుగ్గ సీఐటీయూ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఇక్కడి ప్రజలెవరూ కార్గో ఎయిర్ పోర్టు కోరడం లేదని వంశధార రిజర్వాయర్ పూర్తి చేసి శివారు భూములకు రెండు పంటలకు నీరివ్వాలని మాత్రమే వారు కోరుతున్నారన్నారు. ఎయిర్ పోర్టు వస్తే ఉద్యోగాలు వస్తాయని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని, ఇప్పటికే జిల్లాలో నిర్వాసితులైన ప్రజలకి ఎవరికైనా ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. సమావేశంలో కార్గో ఎయిర్‌పోర్టు పోరాట కమిటీ అధ్యక్షుడు వాసు, కార్యదర్శి అప్పారావు, మోహన్‌రావు, మాధవరావు, కుసుమ, చాపర వేణు పాల్గొన్నారు.


ఐక్యత ప్రదర్శిస్తున్న వామపక్ష నాయకులు